క్లుప్తంగా

లింగంపేటలో ఉచిత నేత్ర వైద్య శిబిరం



లింగంపేటలో రోగులను పరీక్షిస్తున్న ఆప్తాలమిస్టు

గొలుగొండ: కాకినాడకు చెందిన అంజు కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం లింగంపేటలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. లింగంపేట పరిసర ప్రాంతాల్లోని లింగంపేట, గైరంపేట, అమ్మపేట, రామచంద్రపురం, కొత్తపాలెం తదితర ప్రాంతాలకు చెందిన 190 మంది రోగులను పరీక్షించారు. వీరిలో 31 మంది రోగులను శస్త్రచికిత్సల నిమిత్తం కాకినాడకు తరలించారు. శస్త్రచికిత్స అనంతరం లింగంపేటకు పంపిస్తామని వైద్య సిబ్బంది తెలిపారు.

వీఆర్‌ఏ కుటుంబానికి ఆర్థిక సాయం

మాకవరపాలెం: వీఆర్‌ఏ కుటుంబానికి రెవెన్యూ సిబ్బంది రూ.10 వేల సాయం అందించారు. మాకవరపాలెంలో వీఆర్‌ఏగా పని చేస్తున్న గుడాల రాజులు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మృతి చెందాడు. ఈ నేపథ్యంలో మృతుడి కుటుంబానికి ఆర్‌ఐ జెట్టి, వీఆర్వో శాంతకుమారి ఈ మొత్తం అందజేశారు.

70 మందికి నేత్ర పరీక్షలు



కంటి వైద్య శిబిరంలో రోగులు

రోలుగుంట: శంకర్ ఫౌండేషన్ సౌజన్యంతో కుసర్లపూడిలో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. 70 మంది రోగులకు వైద్యులు రమేష్, హరికృష్ణ పరీక్షలు చేశారు. వారిలో 35 మందికి శస్త్ర చికిత్స అవసరమని గుర్తించారు. మిగిలిన వారికి అవసరమైన మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ఇక్కడ ఏర్పాట్లు చేసిన సర్పంచ్ మడ్డు అప్పలనాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు.

విశ్వబ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



అధ్యక్షుడు మహేశ్వరరావును అభినందిస్తున్న జిల్లా నాయకుడు పందూరు శ్రీను

కె.కోటపాడు: మండల విశ్వబ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గం ఎన్నికను ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడు పి.హనుమంతరావు ఆదేశాల మేరకు కె.కోటపాడులో జిల్లా యువజన నాయకుడు పందూరు శ్రీను, పట్నాల రాజుల ఆధ్వర్యంలో ఎన్నిక నిర్వహించారు. సంఘం అధ్యక్షుడిగా తామరపల్లి మహేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా పందూరి వీరాచారి, కార్యదర్శిగా గోవింద, కోశాధికారిగా వరహాలరాజు ఎన్నికయ్యారు. వీరిని అనకాపల్లి జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు బి.రాజేష్, పెట్ల ఈశ్వరరావు, తామరపల్లి నానాజి తదితరులు అభినందించారు.

కేజీహెచ్‌కు వెళ్లి పింఛన్ అందజేత



పింఛన్ అందిస్తున్న వలంటీర్ మహాలక్ష్మినాయుడు

బుచ్చెయ్యపేట: విజయరామరాజుపేటకు చెందిన వలంటీర్ మహాలక్ష్మినాయుడు ఆదివారం విశాఖ కేజీహెచ్‌కు వెళ్లి పింఛన్ సొమ్ము అందించాడు. గ్రామానికి చెందిన పింఛన్‌దారుడు శరగడం అప్పారావు హృద్రోగ సమస్యతో వారం రోజులుగా విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. నిరుపేద కుటుంబానికి చెందిన అతడి ఆర్థిక ఇబ్బందులు తెలుసుకున్న వలంటీర్ సొంత ఖర్చులతో అక్కడకు వెళ్లి పింఛన్ అందించాడు.

గురు పౌర్ణమికి సర్వం సిద్ధం



షిర్డీ సాయిబాబా



చోడవరం: ఉత్సవాలకు ముస్తాబైన వెంకన్నపాలెం సాయిబాబా మందిరం

చోడవరం: గురుపౌర్ణమి వేడుకలకు అన్ని దేవాలయాలు ముస్తాబయ్యాయి. సోమవారం గురుపౌర్ణమి కావడంతో షిర్డీసాయిబాబా మందిరాలతోపాటు ప్రఖ్యాత పుణ్యక్షేత్రమైన చోడవరం స్వయంభూ విఘ్నేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు చేశారు. జిల్లాలో ప్రసిద్ధి షిర్డీసాయిబాబా మందిరాల్లో ఒకటైన చోడవరం మండలం వెంకన్నపాలెం షిర్డీసాయిబాబా మందిరంలో ఉత్సవాల నిర్వహణకు గోవాడ సుగర్ ఫ్యాక్టరీ ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేశారు. చోడవరం పట్టణంలో షిర్డీసాయి బాబా ఆలయం ముస్తాబైంది. సోమవారం ఉదయం నుంచి ఆలయాల్లో స్వామివారికి ప్రత్యేక పూజలు జరుగుతాయి. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. పెద్ద ఎత్తున భక్తులు వచ్చే అవకాశం ఉండటంతో ఆలయాల వద్ద క్యూలైన్లు ఏర్పాట్లు చేశారు. సాయంత్రం ప్రత్యేక రథంపై స్వామివారి ఊరేగింపు నిర్వహిస్తారు. భక్తుల సౌకర్యార్థం మజ్జిగ, మంచినీటి చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్టు ఉత్సవ కమిటీ పేర్కొంది.

చోడవరం రూరల్: పట్టణంలోని షిర్డీ సాయిబాబా మందిరంలో సోమవారం గురుపౌర్ణమి ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నారు. ఉదయం, సాయంత్రం స్వామివారికి సన్నాయి మేళ తాళాలతో తిరువీధి ఉత్సవాలు నిర్వహించారు. ఉదయం లక్షపత్రి పూజ ఉంటుంది. మధ్యాహ్నం భక్తులకు అన్నసమారాధన చేపడతారు. స్థానిక సాయిబాబాతోపాటు, వెంకన్నపాలెంలోని షిర్డీ సాయినాథ మందిరాన్ని రంగురంగుల విద్యుద్దీపాలంకరణలతో తీర్చిదిద్దారు.

రావికమతం: గురుపౌర్ణమి సందర్భంగా రావికమతం, కొత్తకోట సాయిబాబా మందిరాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. సోమవారం ఉదయం నుంచి ప్రత్యేక అభిషేకాలు చేయనున్నారు. తదనంతరం దాతలు కేదారి శెట్టి సర్వేశ్వరరావు కుటుంబీకులు కొత్తకోటలో అన్నసమారాధన ఏర్పాటు చేస్తుండగా, ఎంవీఆర్ సంస్థ సభ్యులు రావికమతంలో భారీ అన్నసమారాధనతోపాటు ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు ఆలయ అర్చకుడు ఆంజనేయమూర్తి తెలిపారు.

గొలుగొండ: మండలంలో జోగుంపేట, గొలుగొండ, ఏఎల్‌పురం తదితర గ్రామాల్లో సాయిబాబా మందిరాల వద్ద సోమవారం గురు పౌర్ణమి పూజా కార్యక్రమాలకు సర్వం సిద్ధమైంది. ఆయా గ్రామాల్లో మందిర కమిటీ సభ్యులు అన్నసమారాధన కార్యక్రమాలకు ఏర్పాటు ఏర్పాట్లు చేశారు.

చోడవరంలో భారీ అన్నసమారాధన



అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు

చోడవరం రూరల్: స్థానిక కేశవస్వామి ఆలయ అంతరాలయంలో కొలువైన జగన్నాథ స్వామివారి ఉత్సవాలు ఘనంగా ముగిసిన సందర్భంగా ఆదివారం భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. గత నెల 20న అంతరాలయంలోని సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథస్వామి వార్ల ఉత్సవ విగ్రహాలను వేడుకగా ఇంద్రద్యుమ్నానికి చేర్చి అక్కడ కొలువైన స్వామివారిని ఏకాదశి వరకు దశావతారాలలో అలంకరించి నిత్యం ప్రత్యేక పూజలు నిర్వహించిన మీదట తిరుగు రథయాత్రతో జగన్నాథ ఉత్సవాలు ముగిసిన సంగతి విదితమే. పట్టణ ప్రముఖులు, భక్తుల సహాయ సహకారాలతో ఉత్సవాలు ఘనంగా ముగియడంతో అన్నసమారాధన ఏర్పాటు చేశారు. అదే సమయంలో సింహాచలం గిరి ప్రదక్షిణకు చోడవరం మీదుగా వెళ్తున్న పలువురు భక్తులు స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమం విజయవంతం కావడంతో ఆలయ ప్రధాన అర్చకుడు సీతారామాచార్యులు, ఆలయ కమిటీ చైర్మన్, సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

నేటి నుంచి వరి విత్తనాల పంపిణీ

రోలుగుంట: మండలంలోని రైతు భరోసా కేంద్రాల వద్ద రాయితీపై వరి విత్తనాలను సోమవారం నుంచి పంపిణీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఏవో ఎస్.విజయలక్ష్మి తెలిపారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న రైతులు నగదు రసీదులు సిబ్బందికి అందజేసి విత్తనాలను తీసుకోవాలన్నారు. ఆర్జీఎల్ మినహా మిగిలిన అన్ని రకాల విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు.

నేడు, రేపు అవురువాడలో 'గడప గడపకు'

మాడుగుల రూరల్: మండలంలో అవురువాడ గ్రామ పంచాయతీ పరిధి గ్రామాల్లో సోమ, మంగళవారాలు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్ ఆదివారం తెలిపారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు హాజరై గ్రామ సచివాలయ భవనంతోపాటు నూతనంగా నిర్మించిన రోడ్లను ప్రారంభిస్తారన్నారు. పార్టీ శ్రేణులు, నాయకులు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

చమ్మచింతలో వరి విత్తనాల పంపిణీ



రైతులకు వరి విత్తనాలు పంపిణీ చేస్తున్న వైస్ ఎంపీపీ మైనం శ్రీనాగగోపి

నాతవరం: రైతులను అన్ని విధాలుగా ఆదుకున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని వైస్ ఎంపీపీ మైనం శ్రీనాగగోపి అన్నారు. చమ్మచింత రైతు భరోసా కేంద్రం వద్ద రైతులకు రాయితీపై ఖరీఫ్ వరి విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఖరీఫ్ సీజన్ వచ్చిందంటే రైతులు విత్తనాల కోసం పెట్టుబడి సాయం కోసం అనేక ఆపసోపాలు పడేవారన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక రైతుల కష్టాలు తీరాయన్నారు. సకాలంలో వారి ఇంటి వద్దకు వరి విత్తనాలు అందిస్తున్నామన్నారు. మే నెలలో వ్యవసాయ పెట్టుబడి కింద రైతు భరోసా సాయాన్ని అందించామన్నారు. గత టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీ సభ్యులు సూచించిన రైతులకు మాత్రమే వరి విత్తనాలు అందేవని విమర్శించారు. దాంతో మిగిలిన రైతులు దళారులను ఆశ్రయించాల్సిన దుస్థితి ఉండేదన్నారు. వారు కల్తీ విత్తనాలు విక్రయించడంతో తీవ్రంగా నష్టపోయేవారన్నారు. సాగు పెట్టుబడి కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి అధిక వడ్డీలకు తెచ్చేవారన్నారు. ఇప్పుడు ఇటువంటి ఇబ్బందులు లేవన్నారు. సర్పంచ్ వెలకాడ కొండబాబు, ఉప సర్పంచ్ అప్పన దివాణం, ఆర్బీకే సిబ్బంది పాల్గొన్నారు.

భానుడి ఉగ్ర రూపం



ఎండ తీవ్రతకు జన సంచారం లేని బీఎన్ ప్రధాన రోడ్డు

బుచ్చెయ్యపేట: వర్షాకాలం వచ్చినప్పటికీ ఎండ తీవ్రత తగ్గలేదు. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఏకధాటిగా ఎండ కాసింది. దీంతో నిత్యం జన సంచారంతో ఉండే ప్రధాన రోడ్లు బోసిపోయాయి. వారం రోజులుగా ఇదే పరిస్థితి నెలకొంది. ఎండ వేడిమిని తట్టుకోలేక ప్రజలు ఆరుబయట తిరగలేక ఇళ్లకే పరిమితం అవుతున్నారు. మరో నాలుగైదు రోజుల వరకు వర్షాలు కురిసే అవకాశం కనిపించకపోవడంతో ఎండలు మండిపోయేలా ఉన్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

తోటాడలో ఘనంగా గిరి ప్రదక్షిణ



గిరిప్రదక్షిణ చేస్తున్న భక్తులు

మునగపాక : మండలంలోని తోటాడలో ఆదివారం గిరి ప్రదర్శన కార్యక్రమం ఘనంగా జరిగింది. తోటాడలోని శ్రీ ఆదినారాయణ స్వామి రాజయోగాశ్రమం ట్రస్ట్ ఆధ్వర్యంలో గిరి ప్రదక్షిణ నిర్వహించారు. ఓంకార పీఠం నుంచి భక్తులు భజనలు చేస్తూ త్రిమూర్తుల ఆలయం, పాటిపల్లి కాలనీ, వరాహ నరసింహ స్వామి ఆలయం, నారాయుడుపాలెం మీదుగా ఓంకార పీఠం వరకు ఊరేగింపు నిర్వహించారు. కాగా సోమవారం ఆలయ ప్రాంగణంలో గురు పౌర్ణమి సందర్భంగా భారీ అన్న సమారాధన జరుగుతుందని మేనేజింగ్ ట్రస్టీ సూరిశెట్టి సుకుమార్ తెలిపారు. ఇదిలా ఉండగా మునగపాకకు చెందిన పెంటకోట రామయ్య కుటుంబ సభ్యులు గిరి ప్రదక్షిణలో భాగంగా విశాఖలో భక్తులకు ప్రసాదాల పంపిణీ చేపట్టారు.

పూరి గుడిసెలో అంగన్‌వాడీ కేంద్రం

- పక్కా భవనం లేక చిన్నారుల ఇబ్బందులు
- గిరి గ్రామం రాజంపేటలో దుస్థితి



పూరి గుడిసెలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రం

మాడుగుల: శంకరం పంచాయతీ రాజంపేట గిరి గ్రామంలో అంగన్‌వాడీ చిన్నారుల అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయి. ఇక్కడ కేంద్రం పూరిగుడిసెలో నేటికీ కొనసాగుతోంది. ఏటా గుడిసె నేసిన రెండు నెలలకే చెదలు పట్టడంతో వర్షాల సమయంలో కారుతోందని అంగన్‌వాడీ కార్యకర్త వాపోతున్నారు. ఈ నేపథ్యంలో అద్దెకు పక్కా భవనం తీసుకుందామంటే, ఇక్కడ అందుబాటులో పక్కా భవనాలు లేవు. దీంతో ఏళ్లుగా కమ్మలగుడిసెలోనే నెట్టుకు రావాల్సిన దుస్థితి నెలకొంది. ఈ కేంద్రంలోనే తాడివలస, గొప్పూరు, రాయిపాలెం, రాజంపేట గిరి గ్రామాలకు చెందిన 25 మంది చిన్నారులు, 15 మంది గర్భిణులు, మరో 23 మంది బాలింతలు లబ్ధి పొందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పక్కా భవనం ఏర్పాటు చేయాలని నాలుగు గిరి గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఇక్కడ చిన్నారులు ప్రభుత్వ పాఠశాలలు వెళ్లాలంటే కొండ గెడ్డలు దాటాలి. దాంతో అంగన్‌వాడీ కేంద్రమే ప్రాథమిక విద్యగా ఉపయోగపడుతోంది.

విద్యుత్ సదుపాయం కల్పించాలి



డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు కృషి ఫలితంగా మా గిరి గ్రామాలకు రోడ్లు వచ్చాయి. అంగన్‌వాడీ భవనానికి నిధులు మంజూరు చేయాలి. దీనికి విద్యుత్ సదుపాయం కల్పించాలి.

– తుర్రే మునలమ్మ, గిరిజన మహిళ, గొప్పూరు

పక్కా భవనానికి ప్రతిపాదన

ఇంత వరకు రాజంపేట గ్రామానికి రహదారి సౌకర్యం లేక భవనం ఏర్పాటు చేయలేదు. ఇప్పుడు రోడ్లు ఏర్పాటవుతున్నాయి. భవన నిర్మాణానికి నిధులు మంజూరు కోసం ప్రతిపాదన పంపించాం.

శ్రీదేవి, ఐసీడీఎస్ పీవో, మాడుగుల

కొట్లాటలో వ్యక్తికి తీవ్ర గాయాలు

అనకాపల్లి టౌన్: తుమ్మపాలలో ఇద్దరు వ్యక్తుల మధ్య ఆదివారం ఘర్షణ చోటుచేసుకుంది. పట్టణ సీఐ దాడి మోహన్‌రావు వివరాల ప్రకారం... అదే గ్రామానికి చెందిన కె.సాయి మద్యం సేవించేందుకు బార్‌కు వెళ్లాడు. అప్పటికే బార్‌లో వెంకటేష్, సాయిల మధ్య మాటామాటా పెరిగి ఘర్షణ ఏర్పడింది. వెంకటేష్ బీర్ బాటిల్ తీసుకుని సాయిని పక్కటిముకల భాగంలో బలంగా పొడవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి క్షతగాత్రుడ్ని విశాఖ కేజీహెచ్‌కు తరలించినట్లు తెలిపారు.

నేడు చీమలపాడులో 'గడపగడపకు'

రావికమతం: చీమలపాడు పంచాయతీ శివారు గిరిజన గ్రామాల్లో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీపీ పైలరాజు ఆదివారం తెలిపారు. కార్యక్రమానికి అనకాపల్లి ఎంపీ భీశెట్టి సత్యవతి, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ హాజరు కానున్నట్టు పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఎంపీ నిధులు రూ.30 లక్షలతో నిర్మించిన సీసీరోడ్లను ఆమె ప్రారంభిస్తారన్నారు. జెడ్.కొత్తపట్నం రైతు భరోసా కేంద్రంలో ఇప్పటికే సిద్ధంగా ఉన్న వరి విత్తనాలను ఎంపీతోపాటు విప్ ధర్మశ్రీ రైతులకు రాయితీపై పంపిణీ చేస్తారన్నారు. ఆయా కార్యక్రమాలకు పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

ఎన్టీపీసీ కారిడార్ రహదారికి మోక్షం





ఎన్టీపీసీ కారిడార్ రోడ్డును మెటల్ వేసి అభివృద్ధి చేస్తున్న దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ కారిడార్ రహదారికి మోక్షం లభించింది. మరమ్మతులతో మూలుగుతున్న ఎన్టీపీసీ రహదారి శీర్షికతో 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి ఎన్టీపీసీ అధికారులు స్పందించారు. సింహాద్రి నుంచి ఏర్పాటు చేసిన కారిడార్ రహదారిపై భారీ వాహనాల రాకపోకలతో రోడ్డు శిథిలావస్థకు చేరి పెద్ద గుంతలు పడ్డాయి. రహదారి గుంతలమయంగా మారడంతో ఎన్టీపీసీ, హిందూజా పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు, ఉద్యోగులు అవస్థలు పడుతుండేవారు. అలాగే వాడచీపురుపల్లి, దలాయిపాలెం, కలపాక, పిట్టవానిపాలెం ప్రాంతాల ప్రజలు రోడ్డులో ప్రయాణించడానికి ఇబ్బందులు పడుతున్నారు. ప్రయాణికుల అవస్థలను గుర్తించిన సంస్థ అధికారులు గుంతలు పడిన కారిడార్ రహదారికి మరమ్మతులు చేపట్టడానికి ముందుకు వచ్చారు. రోడ్డును బీటీ రోడ్డుగా తీర్చిదిద్దడానికి చర్యలు చేపట్టారు. ప్రస్తుతం నిర్మాణ పనులు జోరుగా సాగుతుండడంతో ప్రయాణికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం పాలన

- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే గణేష్



లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ అన్నారు. సంక్షేమ పథకాల అమలుతో రాష్ట్రంలో పేదరిక నిర్మూలనకు సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. మున్సిపాలిటీ 16వ వార్డు శారద నగర్‌లో ఆదివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆ వార్డులో ఏ గడపకు వెళ్లినా ఆయనకు అపూర్వ ఆదరణ లభించింది. తమ వార్డులో అభివృద్ధి పనులు చేసిన ఎమ్మెల్యేను ఇళ్లకు ఆహ్వానించి సత్కరించారు. వారి ఆధారాభిమానులు ఇదే విధంగా కనబరచాలని ఆయన వార్డు ప్రజలను కోరారు. మిలిగిన వీధుల్లో సీసీరోడ్లు, డ్రైనేజీ నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సమాజంలో ఆర్థిక అసమానతలు తొలగించటమే లక్ష్యంగా సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాల ద్వారా నగదును నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తున్నారన్నారు. సీఎంకు అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, మున్సిపల్ కమిషనర్ కనకారావు, తహసీల్దార్ అన్నాజీరావు, వార్డు కౌన్సిలర్ వీరమాచినేని జగదీశ్వరి, కౌన్సిలర్ కర్రి వీసుల చైతన్య, కోఆప్షన్ సభ్యురాలు షేక్ రోజా, పార్టీ నాయకులు బోళెం చిరంజీవి, పార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

మల్లంపాలెంలో చురుగ్గా అభివృద్ధి పనులు

- రూ.20 లక్షలతో సీసీరోడ్లు, డ్రైనేజీల నిర్మాణం



సీసీరోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న శివాజీరాజు, సూర్యనారాయణ

కె.కోటపాడు: మల్లంపాలెంలో అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇక్కడ మెయిన్‌రోడ్డు, రామాలయం వీధిలో సీసీరోడ్లు, డ్రైనేజీల నిర్మాణ పనులకు డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు రూ.20 లక్షలు మంజూరు చేశారు. ఉపాధి నిధులతోపాటు, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా గ్రామానికి కేటాయించిన నిధులతో ఈ పనులు చేస్తున్నట్లు వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా గ్రామంలో అభివృద్ధి పనులకు నిధులు కేటాయించిన డిప్యూటీ సీఎంకు ఆయనతోపాటు వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాట్ల శివాజీరాజు, వార్డు మెంబర్లు వంటాకు గోవిందరావు, వంటాకు రామునాయుడు, చల్లా సురేష్, మాజీ ఉప సర్పంచ్ బొడ్డు దేముడుబాబు, జాగరపు కన్నంనాయుడు, కర్రి అప్పారావు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు 'జగనన్న సురక్ష' శిబిరాలు

మాకవరపాలెం: మండలంలోని గిడుతూరు, మాకవరపాలెంలో సోమవారం జగనన్న సురక్ష శిబిరాలు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో అరుణశ్రీ తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ శిబిరాలు కొనసాగుతాయన్నారు. వివిధ ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తులు చేసిన వారు ఈ శిబిరాలకు వచ్చి పత్రాలు తీసుకోవాలన్నారు.

దేవరాపల్లి: మండలంలోని కొత్తపెంట, ఎం.అలమండ గ్రామాల్లో జగనన్న సురక్ష క్యాంప్‌లను సోమవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సిహెచ్. సుబ్బలక్ష్మి తెలిపారు. ఎం. అలమండలో తహసీల్దార్ ఎం. లక్ష్మి బృందం, కొత్తపెంటలో తన బృందం పర్యవేక్షణలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు.

మాడుగుల రూరల్: జగనన్న సురక్ష కార్యక్రమం సోమవారం తమ గ్రామాల్లో నిర్వహించనున్నట్టు సర్పంచ్‌లు జామి రమణబాబు, నందారపు మంగమ్మ ఆదివారం తెలిపారు. కె.జె.పురంలో తహసీల్దారు పి.వి.రత్నం బృందం, జి. అగ్రహారంలో ఎంపీడీవో మీనాకుమారి బృందం సారథ్యంలో 11 రకాల ధ్రువపత్రాలు ఉచితంగా పంపిణీ చేస్తారన్నారు.

రేపు రెండు సచివాలయాల్లో..

రోలుగుంట: ప్రభుత్వం ప్రజలకు మేలు చేసే భాగంగా నూతనంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాలు మంగళవారం రెండు సచివాలయాల్లో నిర్వహించనున్నట్టు ఎంపీడీవో ప్రభాకరరావు తెలిపారు. కొండపాలెంలో తహసీల్దారు వరహాలు బృందం, కొమరవోలులో తన బృందం ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమాలను స్థానికులు వినియోగించుకోవాలని కోరారు.

హరివిల్లు... కనువిందు



ఆకాశ వీధిలో అందాల హరివిల్లు అందరినీ అలరించింది. జి.మాడుగులలో సోమవారం సాయంత్రం 6:30గంటలకు ఆకాశంలో కనిపించిన ఇంద్ర ధనస్సు స్థానికులు మనస్సులను ఉల్లాసపరిచింది. ఈ ప్రాంత ప్రజలు అందాల హరివిల్లును చాలాసేపు వీక్షించి సెల్‌ఫోన్లలో బంధించారు.

జి.మాడుగుల

నేడు మండల సర్వసభ్య సమావేశం

బుచ్చెయ్యపేట: ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సువర్ణరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు నిర్వహించే సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు హాజరు కావాలన్నారు.